క్లుప్తంగా

బత్తులను పరామర్శించిన రాజ్యసభ్య ఎంపీ

మార్టూరు: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డిని కలసి పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకుంటున్న బ్రహ్మానందరెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఆయన ఆరోగ్య వివరాలను తెలుసుకొని త్వరగా కోలుకొని గతంలో వలే పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని వైవీ ఆకాంక్షించారు.

ఆలయ హుండీలో నగదు మాయం

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవతగా వందల సంవత్సరాల చరిత్ర కలిగిన స్వర్ణమ్మ తల్లి దేవాలయంలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. ఎప్పుడు రద్దీగా ఉండే బ్యాంక్ సెంటర్‌లోని స్వర్ణమ్మతల్లి గుడి ప్రధాన ద్వార తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి దొంగలు హుండీని దోచారు. ఈఘటన మండలంలోని స్వర్ణ గ్రామంలో అర్ధరాత్రి దాటిన తరువాత జరిగి ఉంటుందని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు చెప్తున్నారు. అర్ధరాత్రి వరకు ప్రజలు ఈ రహదారి గుండా ప్రయాణాలు సైతం చేస్తుంటారన్నారు. కారంచేడు–ఇంకొల్లు ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఈ గుడిలో దొంగతనం చేయడం అంటే సామాన్యమైన విషయం కాదని, ఎన్నో రోజులుగా రిక్కీ నిర్వహించి ఉంటారని ప్రజలు భావిస్తున్నారు. జూన్ నెలలో తిరునాళ్ల ముగియగా తరువాత ఒకసారి హుండీని దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. అప్పటి నుంచి హుండీలో భక్తులు వేసిన కానుకలు ఉన్నట్లు చెప్తున్నారు. ఈవిషయాన్ని గ్రహించిన కమిటీ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు తెలిపగా కారంచేడు ఎస్‌ఐ వీ వెంకట్రావు, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

చీరాల ఆర్డీవో బదిలీ

చీరాల: చీరాల ఆర్డీవోగా పనిచేస్తున్న దేవరకొండ అఖిల బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఈనెల 4న ఆమె చీరాల ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. ఆర్డీవోల బదిలీల్లో ఆమె రంపచోడవరం ఆర్డీఓగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో తిరుపతి డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న తూమాటి చంద్రశేఖర్ నాయుడు చీరాల ఆర్డీవోగా రానున్నారని సమాచారం.

300 మంది స్వాములకు అన్నదాన వితరణ



మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవస్థానంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం 300 మంది స్వాములకు అన్నదాన వితరణ చేశారు. సుంకర వెంకటసాయి కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు.

జంపింగ్ వాల్ బహూకరణ




జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్ భవితా విద్యావనరుల కేంద్రంద్రానికి దివ్యాగులకు అవసరమైన జంపింగ్ వాల్‌ను దాతలు గురువారం అందజేశారు. రూ. 15 వేల విలువ గల పరికరాన్ని దేవరపల్లి శ్రీధర్‌బాబు, భార్య దేవరపల్లి భాను ప్రియదర్శిని పాఠశాలకు బహూకరించారు. పాఠశాలలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దివ్యాంగుల చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులు టి శ్రీను, రాజ్యలక్ష్మికి నెలకు సరిపడా ఉచిత సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాంజనేయులు, హెచ్‌ఎం లలితకుమారి, మాధవి, జెడ్పీహెచ్‌ఎస్ స్పెషల్ టీచర్ బాస్కర్ మూర్తి, ఫిజియోథెరపీ డాక్టర్ ఇందిరాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలతో సమావేశం

బల్లికురవ: వివిధ పథకాలకు సంబధించి లబ్ధిదారులను గుర్తించి బ్యాంకులకు అందజేయాలని ఏపీఎం రాజారావు అన్నారు. గురువారం బల్లికురవ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, లక్‌పతి దీదీ మిగిలిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముద్ర, నారిశక్తి రుణాలకు లబ్ధిదారులను త్వరగా గుర్తించి బ్యాంక్ లకు అందజేయాలని, వయోజన విద్య, లోకోస్, ఆడిట్‌ల గురించి వివరించారు. మొబైల్ బుక్ కీపింగ్ ప్రతినెల 15వ తేదీలోపే పూర్తి చేయాలని తెలియజేశారు.



బైటమంజులూరు గ్రామంలోని సాగరు కాల్వపై ఇలా..



కేశవరప్పాడు-తిమిడెదపాడు మార్గంలో గత ఏడాది కోతకు గురైన నేల చప్టా



కొడవలివారిపాలెం-ఇంకొల్లు రోడ్డులో నీటమునిగిన చప్టా

చప్టా.. దాటి వెళ్లేదెట్టా..!

- ప్రమాదకరంగా చప్టాలు
- పదుల సంఖ్యలో ప్రమాదాలు
- దశాబ్దాలుగా నెరవేరని సమస్యలు
- పట్టించుకోని అధికారులు



ముప్పవరం నుంచి బొమ్మనపాడు వైపు వెళ్లే సాగరు కాల్వపై ప్రమాదకరంగా ఉన్న చప్టా

జే.పంగులూరు/కారంచేడు:

దశాబ్దాలు గుడుస్తున్నా గ్రామీణ ప్రాంతాల సమస్యలు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో మాత్రం ఐదేళ్ల గ్రామాల్లో స్వర్ణయుగాన్ని చూడగా నేటి కూటమి ప్రభుత్వంలో నరకం చూస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుఫాన్‌లు, భారీ వర్షాలు కురిసినప్పుడు గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ రహదారులు ధ్వంసం అయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగినప్పుడు గ్రామాల నుంచి రాకపోకలు ఆగిపోయి నరకం చూస్తున్నారు. చప్టాలు, అలుగులు కొట్టుకపోయి కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జే.పంగులూరు మండలంలో పమిడిపాడు మేజర్ వరకు కాల్వపై సుమారు ఐదు చప్టాలు ఉన్నాయి. ఒక చప్టాకు కూడా ఇరువైపుల రక్షణ గోడలేదు.

☛ కారంచేడు మండలంలోని తిమిడెదపాడు-కేశవరప్పాడు, కొడవలివారిపాలెం, స్వర్ణ-పోతినవారిపాలెం వద్ద ఉన్న చప్టాలు పూర్తిగా ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన చప్టాలపై వంతెనలు నిర్మించి గ్రామాల ప్రజల కష్టాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



తిమిడెదపాడు-స్వర్ణ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న అలుగు



నార్నెవారిపాలెం నుంచి రామకూరు వైపు సాగరు కాల్వపై ఉన్న చప్టా

దరివాద పొలాల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

చీరాల: మండలంలోని దరివాద పొలాలను గురువారం ఆర్డీవో అఖిల పరిశీలించారు. పొలాలకు నీరు వచ్చే పంట కాలువ అడ్డుకట్లను ఆర్డీవో సమక్షంలో తొలగించారు. గత మూడు నెలల క్రితం కాలువ హద్దులు తమ పొలాల పరిధిలో ఉన్నాయని కొండా రెడ్డి అనిల్‌కుమార్ అనే వ్యక్తి కింది పొలాలకు నీళ్లు రాకుండా కాలువకు అడ్డుకట్ట వేశారు. ఈ క్రమంలో కాలువ కింద సాగు చేస్తున్న 1500 ఎకరాలకు చెందిన రైతులు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్డీవో పొలాలను పరిశీలించి పంట కాలువకు ఉన్న అడ్డుకట్టలను తొలగించారు. సంబంధించిన పూర్తి రికార్డులను కార్యాలయానికి తీసుకురావాలని రైతులకు ఆర్డీవో సూచించారు. కార్యక్మంలో తహశీల్దార్ గోపీకృష్ణ, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి మాలధారులకు సద్ది ఏర్పాటు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు బలరాం కాలనీలోని రుక్మాబాయి సమేత పాండురంగ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు మాలధారులకు సద్ది ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ సకల ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాత చందు పూర్ణచంద్రరావు ఆర్థిక సహాయంతో ప్రతిరోజు 12 గంటలకు ప్రారంభించనున్న సద్ది కార్యక్రమానికి మండలంలోని అయ్యప్ప, భవాని, శివ మాలదారులతోపాటు వివిధ రకాల మాలలు ధరించిన భక్తులు వినియోగించుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు, విద్యార్థులు



అద్దంకిలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకి రూరల్: మనమందరం సమష్టిగా కృషి చేసి పోలియో మహమ్మరిని తరిమి కొట్టాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. వరల్డ్ పోలియో డే ను గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పోలియో నివారణపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనే రోటరీ లక్ష్యం..

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరులో పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలియో నిర్మూలనే రోటరీ క్లబ్ లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. కార్యక్రమంలో రోటరీ సహాయ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు భవనం రాజగోపాలరెడ్డి, కోట హరిప్రసాద్, సుబ్బారెడ్డి, నాగబైరు శ్రీనివాసరావు, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

చీరాల అర్బన్: ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్‌ను కలుపుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ ముందుకురావాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, చీరాల కృష్ణమూర్తి, మామిడాల శ్రీనివాసరావు, జివై ప్రసాద్, వలివేటి మురళీకృష్ణ, వీరాంజనేయులు రోటరీ సభ్యులు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



చీరాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇసుక లేకుండా రోడ్లు ఎలా వేస్తారు ?

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు: ఇసుక లేకుండా రోడ్లు ఎలా వేస్తారంటూ సర్పంచ్‌లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్టూరు మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ప్రారంభమై ప్రజాప్రతినిధులు అధికారులపై ధ్వజమెత్తడంతో చివరకు వేడిగా ముగిసింది. ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షతన మండల సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆర్ అండ్ బీ అధికారి సుబ్బరాయ శాస్త్రి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రూ. 5 కోట్లకు పైగా వివిధ రకాల 36 రోడ్లు మంజూరయ్యాయని డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని చెప్పడంతో ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసలు ఇసుక అందుబాటులో ఉంటే కదా మీరు రోడ్లు నిర్మించేది. ఇసుక అందుబాటులో లేకుండా రెండు నెలలలో ఏ విధంగా రోడ్లు పూర్తి చేస్తానని హామీ ఇవ్వగలుగుతున్నాని కోలలపూడి సర్పంచ్ ఎం సతీష్ కుమార్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇంతలో ఎంపీడీవో వై శ్రీనివాసరావు జోక్యం చేసుకొని ప్రస్తుతం ఇసుక సరఫరా లేని మాట నిజమేనని స్థానికంగా వాగులు, కాలువల్లో దొరికే ఇసుకతో రోడ్లు నిర్మించాలని చెప్పారు. ఇలా అనటంతో తిరిగి ప్రజాప్రతినిధులు నాణ్యతలేని ఇసుకతో రోడ్లు నిర్మిస్తే మీరు బిల్లులు మంజూరు చేస్తారా? అని ఎదురు ప్రశ్నించడంతో ఎంపీడీవో వద్ద సమాధానం లేక పోవటం గమనార్హం. ఈ క్రమంలో రోడ్ల దుస్థితి గురించి మీడియా ప్రతినిధులు ఆర్ అండ్ బీ అధికారితో మాట్లాడే ప్రయత్నం చేయబోగా ఎంపీడీవో జోక్యం చేసుకొని మీడియా ఇక్కడ జరిగింది రాసుకోవడమే తప్ప ప్రశ్నించరాదంటూ హుకుం జారీ చేయడం విశేషం. ద్రోణాదుల, బబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యులు పెంట్యాల సురేష్, దండా హరిబాబులు విద్యుత్ సమస్యలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలో మండలాల్లోని ఇతర శాఖల అధికారులు, కార్యదర్శులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కిరణ్ కుమార్

నలుగురు జూదరుల అరెస్టు

వేటపాలెం: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. గురువారం దేశాయిపేట పంచాయతీ రామానగర్ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ. 2,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై చెప్పారు.

పోలీసు వ్యవస్థలపై అవగాహన అవసరం



స్వర్ణలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ, హెచ్‌ఎంలు



చినగంజాంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

కారంచేడు/చినగంజాం: సమాజం, పోలీసు వ్యవస్థలపై నేటి తరం విద్యార్థులకు తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వీ వెంకట్రావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంపీ సుబ్బారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సైబర్ నేర నియంత్రణలో యువకుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు.

మరింత విస్తృతంగా వాసవీ క్లబ్ సేవలు



బస్టాండ్‌లో బాలింతలకు ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రారంభిస్తున్న క్లబ్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్

చీరాల అర్బన్: సామాజిక సేవా కార్యక్రమాలను వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా మరింతగా విస్తృతం చేస్తామని క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆదేశాల మేరకు వాసవీ క్లబ్ చీరాల, వనిత క్లబ్ చీరాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో పలు సేవా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. చీరాలలోని పాఠశాలలకు విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలు, బాలింతల కోసం స్థానిక బస్టాండ్‌లో తల్లి బిడ్డకు పాలిచ్చు గది, బస్ షెల్టర్ ఏర్పాటును ఆయన ప్రారంభించారు. క్లబ్ ద్వారా ఇప్పటికే ప్రపంచ దేశాలతో పాటు తొమ్మిది రాష్ట్రాలలో విశేష సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, ప్రయాణికులు వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి సూర్యప్రకాశరావు, క్లబ్ చీరాల అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, బ్రహ్మానందం, సుదర్శనం, జగదీష్, కృష్ణమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో మోసం చేస్తే కఠిన చర్యలు



కాటాలను తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మేదరమెట్ల: దుకాణ యజమానులు తూనికలు, కొలతల విషయంలో మోసం చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల కొలతలు, తూనికల శాఖ ఇన్స్‌పెక్టర్ కే.నాగేశ్వరరావు హెచ్చరించారు. ఈనెల 16న సాక్షి దినపత్రికలో 'కొలతల్లో తేడా.. తూకాల్లో మోసం' అన్న శీర్షికపై కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు నిద్రవీడి గురువారం మేదరమెట్ల సెంటర్‌లోని పలు దుకాణాలను పరిశీలించారు. తనిఖీల్లో సరైన ముద్రలు లేని ఐదు కాటాలను పరిశీలించి దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అక్రమాలు జరిగినా తన దృష్టికి తీసుకురావాలని ఇన్స్‌పెక్టర్ కోరారు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ



కాలువలోకి వెళ్లిన లారీ

చీరాల అర్బన్: లారీ అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈఘటన మండలంలోని తోటవారిపాలెం మలుపు వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం జరిగింది. అందిన వివరాల మేరకు.. లోడుతో లారీ నెల్లూరు వైపు వెళ్తోంది. సరిగా లారీ తోటవారిపాలెం మలుపు వద్దకు రాగానే స్టీరింగ్ పనిచేయక పోవడంతో అదుపు తప్పిందని లారీ డ్రైవర్ తెలిపారు. లోడుతో ఉన్న లారీ కాలువలోకి వెళ్లడం, ఆ సమయంలో రోడ్డుపై ఎదురుగా వాహనాలు రాక పోవడంతో ఎవరికి ప్రమాదం జరగలేదు.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో భాస్కరరావు

చినగంజాం: ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు కలుగుతాయని ఏవో కే భాస్కరరావు అన్నారు. మండలంలోని పల్లెపాలెం, మోటుపల్లి గ్రామ పంచాయతీల్లో రెండో షెడ్యూల్ పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ధాన్యం పండించే రైతులకు రైత బంధు పథకం ద్వారా గోదాములో నిల్వ చేసుకోవడానికి ఈ ఏడాది అవకాశం ప్రవేశపెట్టినట్లు పర్చూరు వ్యవసాయ మార్కెట్ సిబ్బంది పోలూరి నారాయణరెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డులో నిల్వ చేసుకున్న రైతులకు రుణసదుపాయం ఉందని, గిట్టుబాటు ధర రాని పక్షంలో రైతులకు మార్కెట్ యార్డ్ గోడౌన్‌లలో నిలువ చేసే ధాన్యం విలువలో 70 శాతం అంటే సుమారు ఒక్కొక్క రైతుకు రూ 2 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రుణం తీసుకున్న రైతులు 180 రోజుల వరకు వడ్డీ కట్టనవసరం లేదని అటు తరువాత 270 రోజుల వరకు 12 శాతం వడ్డీ కట్టాల్సి ఉంటుందని చెప్పారు. రైతుల ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు. కార్యక్రమంలో వీఏఏలు, కవిత, ఆర్ రేవతి, మత్స్య సహాయకులు ఎస్ పుల్లారావు, కే ప్రమీల పాల్గొన్నారు.